# రాష్ట్రంలో పండ్లకు కొరత

**సప్లై, డిమాండ్ మధ్య 4.53 లక్షల టన్నుల తేడా**
**తొమ్మిదేళ్లలో 5 లక్షల టన్నులకు పైగా ఉత్పత్తి లోటు**
**తెలంగాణ ఉద్యాన 'వర్సిటీ ప్రణాళిక వెల్లడి**

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణలో పండ్లకు రాను రాను కొరత పెరుగుతోంది. రాబోయే దశాబ్దంలో ఈ లోటు మరింత పెరుగుతుందని అంచనా. ప్రస్తుత ఉత్పత్తి స్థాయిలు మరియు భవిష్యత్తు డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటే, 2035 నాటికి రాష్ట్రంలో 5 లక్షల టన్నులకు పైగా పండ్ల ఉత్పత్తి కొరత ఏర్పడుతుందని అంచనా. 2035 నాటికి ఉద్యానవన పంటల కోసం తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం అంచనా వేసిన ప్రణాళిక ప్రకారం డిమాండ్ మరియు సరఫరా మధ్య అంతరం 4.53 లక్షల టన్నులుగా అంచనా వేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది డిమాండ్ 23.18 లక్షల టన్నులు ఉంటుందని లెక్కకట్టింది. అదే 2030 నాటికి డిమాండ్ 23.56 లక్షల టన్నులుగా లెక్క వేయగా, లోటు 4.91 లక్షల టన్నులకు పెరుగుతుందని ప్రణాళికలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పండ్లకు ఇంకా, 5.09 లక్షల టన్నులుగా కొరత అంచనా వేయబడింది. మొత్తంగా 2035 నాటికి పండ్ల డిమాండ్ 23.74 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుంటుంది. రాష్ట్రంలో ఉద్యానవన పంటల ఉత్పత్తిలో లాభదాయకం కాకపోవడం, నాణ్యమైన మొక్కలు సకాలంలో అందుబాటులో లేకపోవడం, కూలీల కొరత, అధిక కూలీ రేట్లు, సరైన యంత్రాలు, మార్కెటింగ్ సమస్యలు, అధిక రవాణా ఖర్చులు, యూనిట్ ప్రాంతానికి తక్కువ రాబడి వంటి అనేక అడ్డంకులు ప్రతిబంధకాలుగా ఉన్నాయి. విశ్వవిద్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలో మొత్తం 11.91 లక్షల ఎకరాల్లో మామిడి, నారింజ, ఆమ్ల నిమ్మ, జామ, దానిమ్మ, టమోటా, వంకాయ, ఆయిల్ పామ్, మిరప, పసుపు సాగు చేస్తున్నారు. తద్వారా 42.58 లక్షల టన్నులు ఉత్పత్తి అయ్యాయి. రాష్ట్ర స్థూల పంట విస్తీర్ణంలో ఉద్యానవన పంటలు ఆరు శాతం ఆక్రమించాయి. రాష్ట్ర వ్యవసాయ స్థూల విలువ ఉత్పత్తికి 30 శాతం ఈ పంటలు దోహదపడుతుండగా, పండ్ల సాగు వృద్ధి రేటు 6.77 శాతంగా ఉంది. ఇక రాష్ట్రంలో కూరగాయల పంటల విస్తీర్ణం గత దశాబ్దంలో (-) 8.4 శాతం ప్రతికూల వృద్ధిని చూసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని దాదాపు 31 శాతం పంటల సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. జిల్లాల్లో వచ్చే ఐదేళ్లలో అదనంగా 1.32 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు విస్తీర్ణంలోకి తీసుకురావాలి. అలాగే రాబోయే ఐదు సంవత్సరాలలో టమోటా, వంకాయ, క్యారెట్, క్యాబేజీ, దోసకాయ, కాలీఫ్లవర్ మరియు ముల్లంగి వంటి కూరగాయల సాగు కోసం 2.45 లక్షల ఎకరాలను విస్తరించాలని తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం ప్రణాళికలో పేర్కొంది.

## ప్రతిష్ఠాత్మక ఎన్‌శాట్-2025కి విద్యార్థుల నుండి భారీ స్పందన!

### తెలుగు రాష్ట్రాల నుండి లక్ష మందికి పైగా విద్యార్థులు హాజరు!

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 13:** విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి ఒక మార్గం ఎన్ఎస్ఏటి- 2025. భారతదేశంలో అత్యంత డిమాండ్ ఉన్న స్కాలర్‌షిప్ అప్టిట్యూడ్ టెస్ట్ పరీక్ష (ఎన్ఎస్ఏటి) గత 19 సంవత్సరాలుగా విజయవంతంగా, నిర్విరామంగా నిర్వహించబడుతోంది. అక్టోబర్ 5, అక్టోబర్ 12 తేదీన నిర్వహించిన ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల నుండి లక్షమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్ఎస్ఏటి 5వ తరగతి నుండి 10వ తరగతుల విద్యార్థులు తమ ప్రతిభను, విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి వీలుగా ఈ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తుంది. ఈ పరీక్షల్లో మంచి ప్రతిభకనబరచిన విద్యార్థులకు కోటి రూపాయల వరకు బహుమతులతో పాటు 50కోట్ల వరకు స్కాలర్‌షిప్ అందించనుంది నారాయణ విద్యాసంస్థ. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల కోర్ కమిటి సభ్యురాలు రమా నారాయణ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి సాధికారత కల్పించడం లక్ష్యంగా నారాయణ ఎన్ఎస్ఏటిను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ పరీక్షను ఎంతో మంది నిపుణులు, దశాబ్దాల అనుభవం కల్గిన మేధావులచే పరిశోధన ఆధారంగా రూపొందించ బడిన పరీక్షగా వారు అభివర్ణించారు. విద్యార్థులు తమ అభిరుచిని అర్థం చేసుకుని, వారి భవిష్యత్ మార్గంలో ముందంజ వేయాలనే లక్ష్యంతో ఈ ఎన్ఎస్ఏటి ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎన్ఎస్ఏటి ఎగ్జామ్‌కు ఎంతో క్రేజ్ ఉందన్నారు. అంతే కాదు ఎన్ఎస్ఏటి 2025 అనేది ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నవిద్యార్థులకు అద్భుతమైన స్కాలర్‌షిప్, నగదు బహుమతుల వరకూ వారి విద్యా ఆకాంక్షలను ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయాన్ని పొందేందుకు ఒక సువర్ణావకాశంగా విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారన్నారు. గత 19 ఏళ్ళుగా ఎంతో మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ పొందుతూ తమ కలలను నెరవేర్చుకుంటున్నారన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులు డబ్బులేక చదువును మధ్యలోనే వదిలేసే పరిస్థితులు రాకుండా వారిని ప్రోత్సహించేందుకే ఈ ఎన్ఎస్ఏటిఇ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సామాజిక బాధ్యతగా ఇక ముందు ఈ ఎగ్జామ్‌ను కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. నారాయణ సంస్థలను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## మనవరాలి కోరిక.. కుటుంబంతో చిరంజీవిని కలిసిన బిజెపి నేత రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు13:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు తన మనవరాలి కోరిక మేరకు ఆమెతో కలిసి మెగాస్టార్ చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆస్ట్రేలియాలో నివసిస్తున్న రామచందర్ రావు మనవరాలు ఐరా ఆశీష్ ఇటీవల భారత్ కు వచ్చారు. చిరంజీవిని కలవాలన్న ఆమె ఆకాంక్ష మేరకు, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి షూటింగ్ స్పాట్‌కు వెళ్ళి కలిశారు. ఈ విషయాన్ని రామచందర్ రావు ఎక్స్ వేదికగా తెలియజేశారు. చిరంజీవితో పాటు హీరోయిన్ నయనతారను కూడా రామచందర్ రావు కుటుంబ సభ్యులు కలిశారు. చిరంజీవితో జరిగిన సమావేశంలో సినిమా విశేషాలతో పాటు, సమకాలీన రాజకీయాలు, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు ఆలోచనలు పంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంతో బిజీగా ఉన్నప్పటికీ చిరంజీవి ఎంతో ఆప్యాయతతో, విలువైన సమయం కేటాయించారని రామచందర్ రావు అన్నారు. తమకు సమయం ఇచ్చినందుకు చిరంజీవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చిరంజీవితో జరిగిన ఈ కలయిక తమ కుటుంబానికి ఒక మరపురాని ఆనందాన్నిచ్చిందని ఆయన అన్నారు.

## బిజెపి అధ్యక్షుడిగా 100 రోజులు పూర్తి చేసుకున్న రాంచందర్‌రావు


రాష్ట్రబిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావును సన్మానిస్తున్న నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు13:** బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రాంచందర్ రావు బాధ్యతలు స్వీకరించి 100 రోజులు పూర్తిచేసుకున్నట్లు బిజెపి రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజునుండే ఆయన దూకుడుతో, నిబద్ధతతో పనిచేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పర్యటనలు, ర్యాలీలు, సదస్సులు, ప్రజాసమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి నల్గొండ, మెదక్, ఖమ్మం, వికారాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించి కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ స్థాయినుండి జెడ్పీటీసీ దాకా బిజెపి అభ్యర్థులు బలంగా పోటీ చేసేలా పార్టీని సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ స్థాయి నుంచి జెడ్పీటీసీ వరకు బిజెపి ప్రత్యక్షంగా పోటీ చేస్తుందని, అభ్యర్థులను గెలిపించే బాధ్యత తానే తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ, తెలంగాణకు మోదీ ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా పోరాటం చేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఎంఎస్ఎంఈలు లాంటి వర్గాలకు లబ్ధి చేకూర్చేలా తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మోదీ ప్రభుత్వం గ్రామీణ పేదల కోసం ఉచిత బియ్యం, ఇళ్ళు, మరుగుదొడ్లు, గ్యాస్ కనెక్షన్లు, మహిళా పొదుపు సంఘాలకు బ్యాంక్ రుణాలు, యువతకు స్వయం ఉపాధి రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని, బీసీ రిజర్వేషన్లలో అవ్యవస్థలను ఎండగడుతూ, రైతులకు ఎరువులు అందేలా ఒత్తిడి తీసుకువచ్చి ప్రజా సమస్యల పక్షాన నిలిచారు. రాజకీయ జీవితంలో నాలుగు దశాబ్దాలుగా నిబద్ధత, క్రమశిక్షణ, ప్రజా సేవకు అంకితమైన ఈ జాతీయవాది, ఇప్పుడు తెలంగాణలో తీరిశిని ప్రతి పల్లె, ప్రతి ఇంటి దాకా తీసుకెళ్లే రథసారథిగా ముందుకు నడిపిస్తున్నారు. కార్యకర్తనుంచి పార్టీ అధ్యక్షుడి దాకా నాలుగు దశాబ్దాల ప్రయాణం అపూర్వంగా నిలుస్తోంది. విద్యార్థి నేతగా రాడికల్‌లతో పోరాడి, ప్రజాసేవలో క్రమశిక్షణతో ఎదిగిన నాయకుడు రాంచందర్ రావు. రాష్ట్రంలో అధికార పీఠం సాధించడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నారు. పుట్టుక నుంచీ సిద్ధాంతానికి నిబద్ధుడైన నిఖార్సైన జాతీయవాది విద్యార్థి దశ నుంచే దేశానికి అంకితమైన కాషాయ సైనికుడు, ఇప్పుడు రాష్ట్ర బిజెపికి సారథ్యం వహిస్తున్నారు. రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణ పేదల సమస్యలపై అడుగడుగునా పోరాడుతూ బిజెపిని ఇంటింటికీ, ప్రజా మనసుల్లోకి తీసుకెళ్తూ కృషి చేస్తున్నారు. రాష్ట్రంలోని అందరు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతోసమన్వయం కల్పిస్తూ బీజేపీని ప్రతిగ్రామానికి, ప్రతి ఇంటికి చేర్చే దిశగా ఎన్. రాంచందర్ రావు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## రిజర్వు ఫారెస్టుగా 13,178.03 ఎకరాలు

### నోటిఫికేషన్ జారీ చేసిన అటవీశాఖ

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** యాదాద్రి భువనగిరి జిల్లాలో13,178,03 ఎకరాల సాధారణ (రక్షిత) ఆటవీ భూభాగాన్ని (విస్తీర్ణాన్ని) రాష్ట్ర ప్రభుత్వ రిజర్వు ఫారెస్ట్ కిందకు బదిలీ చేసింది. అందుకు సంబంధించి ఉత్తర్వులను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ముఖ్య కార్యదర్శి నదీం అహ్మద్ జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని నారాయణపూర్ మండలం మహమ్మదాబాద్, నారాయణపూర్, రాచకొండ గ్రామాల పరిధిలో విస్తరించిన 13,178.03 ఎకరాల అటవీ భూమిని రిజర్వు ఫారెస్ట్ కిందకు మార్చుతూ నోటిఫికేషన్ జారీ. చేశారు. ఈ రిజర్వు ఫారెస్ట్ ప్రాంతానికి హద్దులు సైతం నిర్ధారించారు. సరిహద్దులకు జియో ట్యాగింగ్ కూడా అనుసంధానం చేశారు. తర్వలోనే కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తూ గెజిట్‌ను విడుదల చేయనున్నది.

## నేడు 8 జిల్లాల్లో సబ్సిడీ వేరుశెనగ విత్తనాలు సరఫరా

### వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 46.15 కోట్ల రూపాయలతో 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు సరఫరా చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఈ నెల 14న వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. దాదాపు 45,350 ఎకరాలకు సరిపడా మొత్తం 38434 క్వింటాళ్ళ విత్తనాలను (వేరుశనగ విస్తీర్ణంలో 25 శాతం) రైతులకు అందిస్తామన్నారు. వీటిని మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, వికారాబాద్, మరియు నల్గొండ జిల్లాలలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కాగా జాతీయ నూనె గింజల పథకం 2025-26 లో భాగంగా ఈ సంవత్సరం 66.66 కోట్లు వెచ్చించి నూనె గింజలు విస్తీర్ణం, ఉత్పాదకత పెంచి స్వయం సమృద్ధి సాధించే విధంగా రైతులకు వివిధ రకాల ప్రోత్సాహకాలు కల్పించనున్నట్లు చెప్పారు. 27 లక్షలతో బ్రీడర్ విత్తనాన్ని, రెండు కోట్ల 50 లక్షలతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీడ్ హబ్, సీడ్ స్టోరేజ్ యూనిట్స్‌ను నెలకొల్పడం, రెండు కోట్ల 37 లక్షలతో 24 నూనె తీసే యంత్రాల సరఫరా, 47 కోట్ల ఆరు లక్షలతో నూనె గింజలలో నూతన వంగడాలను ప్రాచుర్యంలో తేవడానికి వీలుగా, గత ఐదు సంవత్సరాల లోపు విడుదలైన అధిక దిగుబడి మరియు చీడపీడల నుండి తట్టుకునే వంగడాలకు సంబంధించిన విత్తనాలను రైతులకు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## ఐదేళ్ల 'బేలా'.. ధర అదిరేలా!

**బారాబంకీ, అక్టోబరు 13:** ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీలో యేటా నిర్వహించే 'దేవా షరీఫ్ మేళా'.. గుర్రాలు, ఆవులు, ఎద్దుల వంటి వాటి క్రయవిక్రయాలకు ఎంతో ప్రసిద్ధి. దేశవ్యాప్తంగా వేలాది మేలుజాతి పశువులను ఇక్కడికి తీసుకొస్తుంటారు. ఈ యేడాది ఏర్పాటు చేసిన మేళాలో ఐదేళ్ల 'బేలా' అనే గుర్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అశ్వం కొనుగోలుకు రూ. 17 లక్షల వరకు చెల్లించేందుకు కొంత మంది ముందుకొచ్చినా రూ. 21 లక్షలకు తగ్గేది లేదని యజమాని, లక్నోకు చెందిన బృజ్‌భాన్ సింగ్ యాదవ్ స్పష్టం చేస్తున్నారు. అరుదైన రీతిలో బేలా నాలు కాళ్లమీద 'కమలం' గుర్తులు ఉండటమే దీనికి కారణమట. దీన్ని అదృష్టంగా భావిస్తుంటారు. బృజ్‌భాన్‌కే చెందిన 20 నెలల దేవా అనే శ్వేత గుర్రం కూడా ఆకట్టుకుంటోంది. అయితే, దీన్ని ప్రస్తుతానికి విక్రయించడం లేదని, కేవలం ప్రదర్శనకు తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రముఖ సూఫీ సాధువు హాజీ వారిస్ అలీషా తండ్రి సయ్యద్ కుర్బాన్ అలీషా జ్ఞాపకార్థం యేటా అక్టోబరు-నవంబరులో ఈ మేళా నిర్వహిస్తుంటారు. గ్రామీణ సంస్కృతి, పశుసంపద ప్రాముఖ్యం, మతసామరస్యానికి ఇది ప్రతీకగా నిలుస్తోంది.

## ఎంఐఎం అభ్యర్థే కాంగ్రెస్ సింబల్‌పై పోటీ: రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు13:** జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిని పార్లమెంటరీ బోర్డు నుంచి ఆమోదం వచ్చిన తర్వాత అధికారికంగా ప్రకటిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. సోమవారం బిజెపిలో వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పోటీ చేస్తుందా? లేక మజ్లిస్ పోటీ చేస్తుందా? లేక మజ్లిస్ పార్టీ అభ్యర్థి కాంగ్రెస్ సింబల్ మీద పోటీ చేస్తున్నాడా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. ఎందుకంటే, ఇప్పుడున్న కాంగ్రెస్ అభ్యర్థి గతంలో ఎంఐఎం అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ వచ్చిన తర్వాత, నేరుగా ఎంఐఎం అధినేత దగ్గరకు వెళ్లి కాళ్లమీద పడి ఆశీర్వాదం తీసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి ఎంఐఎంకి చెందిన వారే. గతంలో ఎంఐఎం గుర్తు పతంగి మీద పోటీ చేశారు. ఇప్పుడూ ఎంఐఎంకు చెందిన వ్యక్తే, కానీ ఈసారి హస్తం గుర్తు మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. ఇది ప్రజలను మోసం చేసే చర్యే అని వ్యాఖ్యానించారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్ మద్దతుతో గెలవాలనే ఆలోచనతో, ఎంఐఎంకు చెందిన అభ్యర్థిని కాంగ్రెస్ టికెట్ మీద పోటీకి దింపుతోందని, ఎంఐఎం-కాంగ్రెస్ మధ్య బంధం స్పష్టంగా కనపడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిచాక వంద రోజుల్లో హామీలు పూర్తి చేస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాలు చేశారు. కానీ ఇంతవరకు నెరవేర్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడేదంతా 420 కేసుల్లానే మిగిలిందన్నారు. దేశ వ్యాప్తంగా, ఇటు తెలంగాణలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం స్పష్టంగా కనపడుతోందని, తెలంగాణలో 8 ఎంపీ సీట్లలో బిజెపిని గెలిపించి ఆదరించారు. అదేవిధంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కూడా బిజెపిని గెలిపించాలని కోరుతున్నాట్లు తెలిపారు. అసలైన ప్రతిపక్షంగా, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను నిలదీసి, వాటిని అడ్డుకుంటాం. కాబట్టి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి అభ్యర్థికిఅవకాశం ఇచ్చి, అసలైన ప్రతిపక్షంగా బలపరచి, అసెంబ్లీలో ప్రజావాణిని బలంగా వినిపించేలా గెలిపించాలని తెలిపారు.

## చిల్డ్రన్ హోంలో దారుణం

## ఆరుగురు బాలురపై లైంగిక దాడి

### కామాంధుడిగా మారిన సంరక్షకుడు

**హైదరాబాద్(సైదాబాద్), అక్టోబరు 13 ప్రభాతవార్త:** సైదాబాద్‌లోని చిల్డ్రన్ హోంలో దారుణం జరిగింది. హోంలోని బాలురను కంటికి రెప్పలా కాపా డాల్సిన గార్డే దారుణానికి ఒడిగట్టాడు. హోంలోని బాలురపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2022 నుండి అవుట్ సోర్సింగ్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న రహ్మాన్ తమ కుమారుడిపై లైంగిక దాడికి పాల్పడినట్లుగా బాధితుడి తల్లి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హోంలోని బాలుడు ఒకరు దసరా పండుగకు ఇంటికి వెళ్లి తిరిగి హోంకు రావడానికి నిరాకరిస్తూ తల్లి వద్ద భోరున విలపించాడు. దీంతో ఎందుకు వెళ్లడంలేదని ఆరా తీయడంతో జరిగిన దారుణం వెలుగు చూసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు బాధితుడు ఒక్కరే కాదని, మరో అయి దారుగురు వరకు ఉన్నట్లుగా తెలిసిందని సమాచారం. నిందితుడు రహ్మాన్‌ను పోలీసులు కస్టడిలోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధిత బాలుడు తనపై జరిగిన దారుణం గురించిహోంలోని మరో ముగ్గురు బాలురతో చెప్పుకున్నాడని తెలియడంతో పోలీసులు ఆ బాలుర స్టేట్‌మెంట్స్‌ను కూడా తీసుకున్నారు. **నివేదికను అందజేశాం : దర్యాప్తు అధికారి:** జరిగిన దారుణ సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి నివేదికను సిడబ్లుసి అధికారులకు అందజేసినట్లు దర్యాప్తు అధికారి, బాలికల సదనం సూపరింటెండెంట్ మైథిలి తెలిపారు. **పోలీసుల ద్వారానే తెలిసింది : సూపరింటెండెంట్ :** జరిగిన దారుణం గురించి ఈ నెల 11వ తేదీన బాధితుడి తల్లి ఫిర్యాదు చేయడంతో సైదాబాద్ పోలీసుల ద్వారానేతమకు తెలిసిందని చిల్డ్రన్ హోంసూపరింటెండెంట్ అఫ్జల్ తెలి పారు. నిందితుడిని విధులనుంచి తొలగించి పోలీసులకు అప్పగించామన్నారు.

## వేటగాళ్లు, స్మగ్లర్ల పాలిట సింహ స్వప్నం హంటర్

**తొలి దశలో కవ్వాల్ ఫారెస్టులో వినియోగిస్తున్న అటవీశాఖ అధికారులు**
**అమ్రాబాద్ ఫారెస్టు జోన్‌లో వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం**

**హైదరాబాద్, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** అటవీశాఖ అధికారులు స్మగ్లర్లు, వేటగాళ్ళ ఆట కట్టించేందుకు ఒక వైపు సాకేంతికతను వినియోగించుకుంటూ మరో వైపు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించు కుంటున్నారు. ఇందులో భాగంగా బెల్జియం మాలోనియన్ బ్రీడ్‌కు చెందిన హంటర్‌ను (కుక్క) కూడా రంగంలోకి దించారు. అంతకు ముందు స్మగ్లర్ల ఆట కట్టించేందుకు ఉపయోగించిన చీతాను కూడా వినియోగించారు. అది అనారోగ్యకారణాలతో మరణించడంతో దాని స్థానంలో హంటర్‌ను కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టు (కెటిఆర్)లో వేటగాళ్ళు, స్మగ్లర్ల ఆట కట్టించేందుకు ఫారెస్టు ఆఫీసర్లు హంటర్‌ను రంగంలోకి దించారు. ఇటీవల చండీఘర్‌లో ట్రైనింగ్ పూర్తి చేసుకుని వచ్చింది. మొదటి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసి అధికారులు మన్ననలు కూడా పొందింది. ఈ హంటర్‌ను అధికారులు అటవీ సరిహద్దు గ్రామాల్లో తిప్పుతూ విస్తృతంగా ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు. ఇక నేరుస్తులు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోలేరని హెచ్చరిస్తున్నారు. హంటర్ పేరు చెబితే స్మగ్గర్లు ,వేటగాళ్ళు హడలిపోతున్నారు. ప్రస్తుతం అటవీశాఖలో ఇదిఒక్కటే ఉందని, త్వరలో మరోక హంటర్‌ను తీసుకు వచ్చి దాన్ని అమ్రాబాద్ రిజర్వు ఫారెస్టులో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు

**చండీఘడ్‌లో 7 నెలల శిక్షణ:** చండీఘడ్‌లోని నేషనల్ ట్రైనింగ్ ఫర్ డాగ్స్ , ఎనిమిల్స్ సెంటర్‌లో 7 నెలులు (ఈ జనవరి నుంచి అగస్టు ) వరకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. డాగ్ హ్యాండ్లర్స్‌గా జిన్నారం డివిజన్‌కు చెందిన బీట్ ఆఫీసర్లు అనిల్‌కుమార్ ,పరమేష్‌లు కూడా ఇందుకు సంబంధించి ట్రైనింగ్ తీసుకున్నారు.

## సామూహిక అత్యాచారం

### ఐదుగురు నిందితుల అరెస్టు

**రాంచీ, అక్టోబరు 13 :** ఒక బాలికపై 9 మంది వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక కుటుంబం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు.


జార్ఖండ్ రాజధాని రాంచీలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి రాంచీలోని రతు ప్రాంతంలో బాలిక (14)పై 9 మంది వ్యక్తులు సామూహికంగా అత్యాచారం చేశారు. కాగా, ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. బాధిత బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం పలు ప్రాంతాల్లో పోలీసులు రైడ్ చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మరోవైపు మిగిలిన నలుగుర ్ల పోలీస్ అధికారి తెలిపారు.

## కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టుకు నిజాం వారసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు13:** రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపిన శేరిలింగంపల్లి మండలం కంచగచ్చిబౌలి భూముల విషయంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. ఈ భూముల విషయంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య యాజమాన్య హక్కుల విషయంలో వివాదం నడుస్తుండగా తాజాగా మరో మలుపు చోటు చేసుకుంది. కంచగచ్చిబౌలిలో ఉన్న 2,725 ఎకరాల 23 గుంటల భూమికి నిజమైన యజమాని ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ అని ఆయన వారసులు తాజాగా ఆరోపిస్తున్నారు. అసఫ్ జాహి రాజవంశ వారసులు కంచగచ్చిబౌలిలోని 2,725 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు విచారిస్తున్న సుమోటో రిట్ పిటిషన్‌లో తమను చేర్చుకోవాలని ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే చట్టపరమైన నోటీసులు జారీ చేశామని, ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని ఆపడానికి న్యాయపరమైన జోక్యాన్ని కోరుతున్నట్లు వారు తెలిపారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలోని 25,26 సర్వే నెంబర్లలోని కంచ గచ్చిబౌలి భూమి 2725 ఎకరాల 23 గుంటలు కలిగి ఉంది, ఇది చారిత్రాత్మకంగా ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కు చెందినదని వారు పేర్కొన్నారు. తొమ్మిదవ నిజాంగా నియమించబడిన, అసఫ్ జాహి కుటుంబ వ్యవహారాల సంరక్షకుడు రౌనఖ్ యార్ ఖాన్ కంచ గచ్చిబౌలి భూమి పూర్వీకులు భారతదేశానికి చేసిన సేవకు చిహ్నం అని అభివర్ణించారు. ముత్తాత ఆరవ నిజాం మహబూబ్ అలీ ఖాన్, తాత ఏడవ నిజాం ఉస్మాన్ అలీ ఖాన్, 1965 యుద్ధంలో ప్రజల కోసం విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, మౌలిక సదుపాయాలను నిర్మించినట్లు ఆయన వివరించారు. నిజాం వారసుల హక్కుగా భూములను రక్షించడం ద్వారా నిజాం వారసత్వాన్ని గౌరవించాలన్నారు. ఈ పోరాటం అభివృద్ధి ముసుగులో చరిత్ర చెరిపివేయకుండా కాపాడటం కోసమని రౌనఖ్ యార్ ఖాన్ స్పష్టం చేశారు.

## మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతి

### సంతాపం తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి


లక్ష్మారెడ్డి భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న పలువురు నేతలు

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 13 ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి మన వడు మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి (84) సోమవారం ఉదయం హైదర్‌గూడలోని అపోలో ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పలువురు రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. లక్ష్మారెడ్డికి జర్నలిజంపై మక్కువ ఎక్కువగా ఉండటంతో 1980లో ఎన్ఎస్ఎస్ ఏజెన్సీని ప్రారంభించారు. ఎమ్మెల్యేగా, స్పోర్ట్స్ ఛైర్మన్‌గా, జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటి అధ్యక్షుడిగా, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌కు విశేషమైన సేవలు అందించారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి రెండు సార్లు ఎంపిగా పోటీ చేసి ఓడిపోయారు. లక్ష్మారెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల కుటుంబ సభ్యులు ఆయనను హైదర్ గూడలోని అపోలో ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. ఆయన చికిత్స పొం దుతూ సోమవారం ఉదయం 6 గంటలకు మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు సాయంత్రం 4 గంటలకు మహాప్రస్థానంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెవిపి రామచంద్రరావు, మాజీ మంత్రి మర్రి శశిధ ర్‌రెడ్డి, ప్రెస్‌అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జర్నలిస్టులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. లక్ష్మారెడ్డి మృతికి టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఎపిడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఎన్ఎజె నాయకులు ఎన్.కొండయ్య, అమరయ్య, కె.మం జిరి తదితరులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సాను భూతి తెలియజేశారు.

## పూర్తిగా తగ్గుముఖం పట్టిన సీజనల్ వ్యాధులు: మంత్రి దామోదర్ రాజనర్సింహా సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు13:** రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖాన్ల పనితీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత రెండేండ్లతో పోల్చితే, ఈ ఏడాది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర కేసులు గణనీయంగా తగ్గాయని హెల్త్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీంద్ర నాయక్ మంత్రికి వివరించారు. గతేడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకూ చికున్‌గున్యా కేసులు 361 నమోదవగా, ఈ ఏడాది జనవర్ నుంచి సెప్టెంబర్ వరకూ 249 కేసులు మాత్రమే నమోదయ్యాయని వెల్లడించారు. ఇదే సమయంలో గతేడాది 226 మలేరియా కేసులు నమోదవగా, ఈ ఏడాది 209 కేసులు మాత్రమే వచ్చాయన్నారు. గతేడాది టైఫాయిడ్ కేసులు 10,149 నమోదవగా, ఈ ఏడాది 4600 మాత్రమే నమోదయ్యాయని అధికారులు వివరించారు. గతేడాదితో పోలిస్తే డెంగీ కేసులు 2900 తక్కువగా నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు అధికారులు మంత్రికి నివేదిక అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల ప్రభావం తక్కువగా ఉండడం అభినందనీయమన్నారు. మొత్తంగా చూసినప్పుడు కేసులు తక్కువగా ఉన్నప్పటికీ, గ్రేటర్ హైదరాబాద్, మరో నాలుగైదు జిల్లాల్లో స్వల్పంగా కేసులు పెరిగాయని, ఆయా జిల్లాల్లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలన్నారు. ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, ఆయా జిల్లాల్లోని హాస్పిటళ్లలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని మంత్రి సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, ఆ మార్పుల వల్ల ప్రబలే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

